# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **విశాఖపట్నం రైల్వే జోన్ త్వరలో ప్రారంభం కానుందని తెలిపిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.**

2. **ఆధ్యాత్మిక అభివృద్ధితో పాటు శాంతి బాటలో దేశం నడుస్తోందని పేర్కొన్న కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి.**

3. **నేటి నుంచి రెండు రోజుల పాటు తిరుమల తిరుపతిలో పర్యటించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు.**

4. **అమరావతి అభివృద్ధిలో భాగంగా అమలు చేస్తున్న డిజిటల్ ప్రణాళిక విధానానికి జాతీయ స్థాయిలో గుర్తింపు.**

5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 132వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ విశాఖపట్నం రైల్వే జోన్ త్వరలో ప్రారంభం కానుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రాపురం రైల్వే స్టేషన్ లో విశాఖ గుణపూర్ పాసింజర్ రైలు హాల్ట్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు తో కలిసి కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రైల్వే హాల్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ హాల్ట్‌ల వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు ప్రయాణ భారం గణనీయంగా తగ్గుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ..

వాయిస్..25.. సెకన్లు

---------------------------

ఆధ్యాత్మిక, అభివృద్ధితో పాటు శాంతి బాటలో దేశం నడుస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఆయన ఈరోజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రంగనాయకుల మండపంలో శ్రీవారి తీర్థ ప్రసాదాలను ఆలయ అధికారులు కేంద్రమంత్రికి

అందజేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రపంచమంతా యుద్ధ భూమిలో ఉంటే.. భారతదేశం మాత్రం సురక్షితంగా ఉందని చెప్పారు. ప్రపంచానికి ఆదర్శంగా భారతదేశం ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలియజేస్తూ..

..వాయిస్...30 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ రోజు నుంచి రెండు రోజుల పాటు తిరుమల తిరుపతిలో పర్యటిస్తారు. ఈ సాయంత్రం కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకుంటారు. రేపు కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 44 లక్షల రూపాయలను అన్నదాన కార్యక్రమానికి విరాళంగా అందజేసి, స్వయంగా యాత్రికులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేయనున్నారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ను సందర్శించి, టీటీడీ వాటర్, ఫుడ్ అనాలసిస్ ల్యాబ్ తో పాటు ఫసాయ్ స్టేట్ ఫుడ్ ల్యాబ్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు భద్రతపరమైన అన్ని ఏర్పాటు చేశారు.

---------------------------

పదో తరగతి ఆంగ్ల భాష పరీక్షను వచ్చే నెల 2వ తేదీ నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ పరీక్షల విభాగం మొదట ప్రకటించిన తేదీల ప్రకారం ఈ పరీక్ష రేపు జరగాల్సి ఉండగా, రంజాన్ సెలవును రేపటికి మార్చడంతో ఆంగ్ల పరీక్షను అన్ని పరీక్షలు ముగిశాక వచ్చే నెల 2వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొంది.

---------------------------

అమరావతి అభివృద్ధిలో భాగంగా అమలు చేస్తున్న డిజిటల్ ప్రణాళిక విధానానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ-ఏపీ సి.ఆర్.డి.ఎ. రూపొందించిన "అమరావతి ఇంటిగ్రేటెడ్ డిజిటల్ అర్బన్ ప్లానింగ్ అండ్ గవర్నెన్స్ ప్లాట్‌ఫామ్"కు ఎకనామిక్ టైమ్స్ గోవ్‌టెక్ అవార్డ్స్- 2026లో బంగారు పురస్కారం లభించింది. న్యూఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఏపీ సిఆర్‌డిఎ కమిషనర్ కె. కన్నబాబు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ భవనాలైన సెక్రటేరియట్ టవర్స్, హైకోర్టు, అసెంబ్లీ నిర్మాణం 2027 డిసెంబర్ నాటి కల్లా పూర్తి చేస్తామని తెలిపారు.

---------------------------

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలోని సామాజిక ఆస్పత్రిని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆకస్మికంగా ఈరోజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలని మంత్రి వైద్యులకు సూచించారు. నూతన భవన నిర్మాణం త్వరలో పూర్తిచేయాలని గుత్తేదారుడిని మంత్రి ఆదేశించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే

"మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ తీరం, యానాం పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 3.1 కిలో మీటర్ల ఎత్తులో కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి తమిళనాడు మీదుగా దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు ఉన్న ద్రోణి సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో విస్తరించి కొనసాగుతోందని వాతావరణ కేంద్ర అధికారి ఎమ్.వెంకట్రావు పేర్కొన్నారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలో ఈరోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేక ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్..20 సెకన్లు

---------------------------

నంద్యాల జిల్లా శ్రీశైల మహా క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు నిన్న సాయంత్రం శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారికి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారు రాజరాజేశ్వరిగా ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో చివరి రోజైన ఈరోజు ఉదయం చండీశ్వరపూజ, పూర్ణాహుతి, త్రిశూల స్నానం వంటి కార్యక్రమాలు జరిగాయి. రాత్రి ఏడు గంటలకు ఉత్సవమూర్తుల అశ్వవాహన సేవ జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

---------------------------

ప్రతి సంవత్సరం మార్చి 20వ తేదీన 'ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం' నిర్వహిస్తున్నారు. "సంతోషకరమైన నోరు సంతోషకరమైన మనస్సును కలిగి ఉంటుంది." అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం జరుపుకుంటున్నారు. నోటి పరిశుభ్రత, దంత వ్యాధుల నివారణ, వాటి ప్రాముఖ్యతపై వరల్డ్ డెంటల్ ఫెడరేషన్ ప్రపంచవ్యాప్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తోంది. 3.5 బిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేసే నోటి వ్యాధులపై పోరాడేందుకు, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి ఈ దినోత్సవాన్ని పాటిస్తారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక నూతన సంస్కరణలు తీసుకొచ్చిందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను మంత్రి నిన్న పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధనతోపాటు పాఠ్య పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు.

====================